క్లుప్తంగా


వైభవంగా నరసింహస్వామి కల్యాణోత్సవాలు



కొంతేరులో పల్లకిపై ఊరేగుతున్న శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు వైకానస ఆగమ ప్రకారం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో శుక్రవారం మధ్యాహ్నం స్వామివారి పల్లకి ఉత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సదస్యం, మంగళవారం ఉదయం పూర్ణాహుతి, చక్రస్నానం రాత్రి స్వామికి పుష్పయాగం నిర్వహిస్తారు. ఉత్సవాలను ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామ పరిధిలోని కాపులకొడపలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని శనివారం ప్రత్యేంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలతో జీవీఎస్‌వీఆర్‌ఎం విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దాతలు నోట్ పుస్తకాలు అందించారు. శనివారం విద్యార్థులకు రెమిడీయల్ టీచింగ్ కోసం దాత ధర్మ పరిరక్షణ అధ్యక్షులు గాదె వెంకన్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దాతల సహకారం ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు.

ఆస్తి పన్ను చెల్లించాలి

నరసాపురం: పెద్ద మొత్తంలో ఏళ్ల తరబడి ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు బకాయిలు వెంటనే చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మొండి బకాయిలు రాబట్టడానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. వార్డు సచివాలయాల కార్యదర్శులు పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే భారీ మొత్తంలో ఆస్తి పన్నులు బకాయిలున్న వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ రెవిన్యూ అధికారులను ఆదేశించామని స్పష్టం చేశారు.

వ్యాధుల కాలం.. దోమలు దూరం

- మలేరియా మాసోత్సవాలు ప్రారంభించిన వైద్యారోగ్య శాఖ
- దోమల నిర్మూలనపై అవగాహనా సదస్సులు



దోమల నివారణకు దోమల మందు పిచికారీ చేయిస్తున్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్)



ఫ్రైడే డ్రైడేలో అవగాహన చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్ : వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వాతావరణ మార్పులతో వచ్చే జ్వరాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల అనేక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాకాలంలో ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ మలేరియా మాసోత్సవాల పేరు తో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తుంది. నీటి కుంటలు నిల్వ ఉండిపోవడం అలాగే కొబ్బరిబొండాలు వంటి తినుబండారా లను రోడ్లపై పడేయడంతో కొద్దిరోజులకు దోమ లు, విష పురుగులు చేరడంవల్ల ప్రజారోగ్యం తీవ్రంగా నష్టపోతుందని నిపుణులు చెబుతున్నా రు. డబ్ల్యూహెచ్‌ఓ ఆదేశాల ప్రకారం ప్రతీ శుక్రవారం డ్రై డే చేపడుతున్నారు. దోమలను నియంత్రించలేకపోతే వైరల్ జ్వరాలు తీవ్రత కూడా పెరుగుతుంది. వాతావరణంలో వచ్చే మార్పులవల్ల తేమశాతంఉన్న ప్రదేశాల్లో దోమలు అధికంగా వ్యాప్తి చెందుతాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మలేరియా నిర్మూలన వారోత్సవాలను నిర్వహిస్తుంది. ఇప్పటికే నియోజకవర్గంలో ఉన్న ఆరు పీహెచ్‌సీల్లో మలేరియా యూనిట్ శాఖ వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహించారు. అలాగే మలేరియా నిర్మూలన లక్ష్యంగా ఈ మాసోత్సవాలు గ్రామాల్లో నిర్వహిస్తున్నారు.

మలేరియా చికిత్స ఇలా..

- మలేరియా సోకిన రోగి 14 రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలి. మధ్యలో చికిత్సపై అశ్రద్ధ చేస్తే మళ్లీ తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది.
- పాల్సీపారం మలేరియా అయితే కేవలం మూడు రోజుల పాటు ఏసీటీ చికిత్సను తీసుకోవాలి.
- మలేరియా చికిత్స అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంబాటులో ఉంటుంది.
- ఈ మలేరియా వ్యాధికి కారణమైన అనాఫిలిస్ దోమ వర్షాకాలంలో ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

నివారణ చర్యలివే..

- పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను కూడా పాటించాలి.
- ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పరిసరాల్లో ఉన్న నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా తరచూ లార్వాసైడ్ క్రిమి సంహారక మందును పిచికారి చేయాలి.
- ఇంట్లో గోడలపై సింథటిక్ పైరిత్రాయిడ్ ఏసీఎం క్రిమి సంహారక మందును పిచికారీ చేయాలి.
- దోమ తెరలను ఏర్పాటుచేయడంతో పాటు క్వాలిటీ ఉన్న దోమ చక్రాలు, లిక్విడ్‌లతో దోమలను నివారించుకోవాచ్చు.
- మలేరియా సోకిన వ్యక్తి త్వరగా కోలుకునేందుకు పండ్ల రసాలు, గ్లూకోజ్ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల సంభవించే మలేరియా వ్యాధి నియంత్రణకు జూన్ ఒకటి నుండి 30 వరకూ ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల వ్యాప్తిని అరికట్టి మలేరియా వ్యాధిని నివారించవచ్చు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. – చంద్రశేఖర్, పీహెచ్‌సీ వైద్యుడు, బంగారు వారి చెరువుగట్టు, పాలకొల్లు

జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రారంభం



జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా జిల్లా దివ్యాంగులు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని నరసాపురం రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ దాసి రాజు అన్నారు. శనివారం స్థానిక అంజలి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ఆర్‌డీఓ దాసి రాజు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పునరావాస కేంద్రాన్ని ప్రారంభించామని, అతి త్వరలో అనుమతులు వస్తాయని అనుమతులు వచ్చిన అనంతరం ఇక్కడ నుంచి పరికరాలు అందిస్తామని స్పష్టం చేశారు. అంజలి పాఠశాల చైర్మన్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి పునరావాస కేంద్రం అధికారిక కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ వీడివి ప్రసాద్, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంబటి సాయితేజ, అనంతపల్లి సాయి సతీష్, ఎంఈఓ ఐఆర్ఎన్‌వీజి శర్మ, అడ్డాల వాసు, పప్పుల దుర్గేష్ పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు



ఉదయం 10 గంటలకే నిర్మానుష్యమైన కొప్పర్రు సెంటర్

- ఉదయం తొమ్మిది నుంచే ఎండ తీవ్రత
- నిర్మానుష్యంగా మారుతున్న ప్రధాన రహదారులు, కూడళ్లు



సీతారాంపురంలో 216 జాతీయ రహదారి ఇలా

నరసాపురం రూరల్: భానుడు భగభగలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండలకు తోడు భరించలేని ఉక్కబోత ప్రజలను ఊపిరాడనివ్వకుండా చేస్తోంది. రోహిణీ కార్తె కావడంతో వారం రోజులుగా ఎండలు మరింత తీవ్రంగా ఉన్నాయి. ఎండ తీవ్రతకు గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లుసైతం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకూ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు చల్లని పానీయాలతో సేదతీరుతున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఏమైనా పనులుంటే ఉదయం 10 గంటల్లోపే చేసుకోవాలని, ఆ తర్వాత సాధ్యమైనంత వరకూ బయటకు వెళ్లకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తలకు టోపీలు, రుమాలు ధరించాలని స్పష్టం చేస్తున్నారు.

నేటి నుంచి పాలకొల్లులో ఒక్కపూటే తాగునీరు

పాలకొల్లు సెంట్రల్: నిడదవోలు, నరసాపురం కాలువ పూడిక పనుల్లో భాగంగా కాలువ నీరు పాలకొల్లు కెనాల్‌కు చేరుకోవడానికి మరికొంత ఆలస్యం అవుతున్న కారణంగా పట్టణంలో తాగునీటి సమస్య ఏర్పడింది. వేసవిలోను రెండు పూటలా తాగునీరు అందించగా నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో పట్టణ ప్రజలకు ఒక్క పూట మాత్రమే తాగునీరు అందించనున్నట్లు మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. కాలువ విడుదల అయ్యే వరకూ ఆదివారం నుంచి ఉదయం 6 నుండి 7 గంటల వరకూ ఒక్కపూట మాత్రమే నీరు అందించనున్నామని స్పష్టం చేశారు.

కుళాయిల ద్వారా మురుగునీటి సరఫరా

నరసాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కుళాయిల నుంచి ముగురునీరు వస్తోంది. 30, 31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేయకుండా మంచినీటిని కుళాయిల నుంచి వదులుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదనే వాపోతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



గుడ్డ సంచిపై సంతకం చేస్తున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు సూచించారు. పర్యావరణ ప్రేమికుడు సబ్బితి వినయ్ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 6 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పుతో వస్త్రంతో సంచి తయారు చేసి ఆర్డీవో కార్యాలయంలో ప్రదర్శించారు. శనివారం సంచిపై ఆర్డీఓ సంతకం చేసి మాట్లాడారు. ప్రస్తుతం ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ఓ సవాల్‌గా మారిందన్నారు. ప్లాస్టిక్ వాడకం అరికట్టకపోతే భవిష్యత్‌లో పెను నష్టాలు చవిచూడాల్సివస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వినయ్ గతంలో కూడా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిచేందుకు అనేక కార్యక్రమాలు చేశారని అభినందించారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలి బంధువుకు నగదు అందిస్తున్న గాంధీరాజు

పాలకొల్లు సెంట్రల్: యలమంచిలి మండలంలోని గుంపర్రు గ్రామానికి చెందిన బండి సత్యవాణికి వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. బాధితురాలు బోనెమెరో వ్యాధి బాధపడుతుందని విషయం తెలియజేయగా వసుద ఫౌండేషన్ నుండి రూ. 10 వేలు నగదు అందించినట్లు ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు తెలిపారు. కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు చేతులు మీదుగా బాధితురాలి తండ్రికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఐవీ రామరాజు, ఎ.త్రిమూర్తులు రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ



నరసాపురంలో బక్రీద్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నరసాపురం: బక్రీద్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మిషన్ హైస్కూల్ రోడ్డులోని మసీదు వద్ద అంజుమన్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వందలాదిమంది ముస్లింలు ఉదయమే మసీదు వద్దకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. అంజుమన్ సంఘ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ మాట్లాడుతూ బక్రీద్ త్యాగానికి ప్రతీక అన్నారు. తోటివారికి సాయపడమని ఖురాన్ ప్రబోధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దావూద్ ఖాన్, బడేవలీ, ఎండీ బాషాఖాన్, అఫరోఖాన్, మౌలాలీఖాన్, బషీర్ ఖాన్, ఖాజా, బషీ పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

పెనుగొండ: త్యాగాలకు బక్రీద్ పండుగను జరుపుకుంటారని ముస్లిం సంక్షేమ సంఘ అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరా సాహెబ్ అన్నారు. శనివారం పెనుగొండ, ఆచంట మండలాల్లో బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లోని మసీదుల్లో ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. మండల పరిషత్ కో–ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ సుజయుద్దీన్, షేక్ అబ్బుల్ రెహమాన్, షేక్ మీరాషరీఫ్, షేక్ బాషా, షేక్ ఖాజా, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ



ఎక్సైజ్ స్టేషన్ పరిశీలిస్తున్న జిల్లా ఏసీ ప్రభు కుమార్

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా అసిస్టెంట్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏలూరు కె.వి ప్రభు కుమార్ శనివారం సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారికంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ స్టేషన్ రికార్డులు తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలన

భీమవరం అర్బన్: విలేజ్ క్లినిక్‌లకు ఏ రోగి వచ్చినా అన్ని రకాల వ్యాధుల మందులు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాడేరులో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ముందుగా పలు రికార్డులను పరిశీలించారు. రు. రోజుకు రోగులు ఎంతమంది వస్తున్నారు? ఏయే మందులు అందుబాటులో ఉన్నాయి? అనే అంశాలు ఆరా తీశారు.

ప్రజలను మోసం చేసిన కూటమి సర్కారు



కోలమూరులో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఉండి: గత ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగించిందని సీపీఐ నాయకులు మండిపడ్డారు. గ్రామ స్థాయిలో విస్తృత సమావేశాలు ఏర్పాటు చేస్తున్న సీపీఐ నాయకులు కూటమి పార్టీ మోసాలను ఎండగడుతున్నారు. శనివారం కోలమూరు, చిలుకూరు గ్రామ కార్యదర్శులు, ఉండితోపుడు బండ్ల శాఖల్లో సీహెచ్ కుమారి, కర్రి సూరిబాబు,గొర్రెల కోటేశ్వరరావులను కార్యదర్శులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామానా సురక్షిత తాగునీరు, వేళాపాళా లేని విద్యుత్ కోతలను నిరోధించాలంటూ గ్రామాల్లో తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు అన్నీ అస్తవ్యస్తంగా మారాయని మండిపడ్డారు.అధికారంలోకి రాగానే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటిస్థలం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు.